# సింహాద్రి పాకం

సింహాద్రిరావు తన ప్రస్తుతస్థితిని టట్టపరుచుకో దలుచుకొని గట్టిగా ఆలోచించేడు. "ఇంతవరకు కథ బాగానే నడిచింది. ఈ బోయపాడు గ్రామం చిన్న ఉపాధ్యాయుణ్ని మంచిచేసుకొని దోమతెర స్వరూప మొకటి దక్కించుకొన్నాను. మొత్తం మీద ఉపాధ్యాయుల నందరినీ కాస్త ఉబ్బవెయ్యాలి. లేకపోతే వీళ్ళమధ్య నెగ్గేటట్టా కనబడదు. ఈ మన్నేంలో నిలబడే ఎత్తులేవు ఈ కలికాలంలో. అందులో ఈ కరువు కాలంలో, ఎవడిపొట్ట వాడు గడుపుకొని, ఎవడి పెళ్ళాం బిడ్డలని వాడు పోషించుకో లేకుండా అఘోరిస్తూంటే. పొరుగువాడి గొడవా కావాలి? కాబట్టి వీళ్ళస్నేహం అభివృద్ధిచేసుకొని ఇక్కడ నిలదొక్కుకోవాలి. ఇనస్పెక్టరు రేపు సాయంత్రందాకా ఇక్కడ ఉండనే ఉంటానని పొద్దున్న చెప్పనే చెప్పేడు. కాబట్టి మనం ఒక్కటే పార్టీజరిపించి నలుగురినీ బుటలో వేసుకొందాం. కావలసిన వస్తువులన్నీ మేష్టర్లే సరఫరా చేస్తారు. అదేమంత పెద్ద విషయంకాదు! పెద్దమేష్టరు చెవిలో మొదటకాస్త వేస్తాను" అని ఒక ఎత్తువేశాడు.

ఇవతల పెట్టివున్న డ్రాయరులోని రికార్డు కోసం పెదమేష్టరు గదిలోంచి ఇవతలకిరాగా, సింహాద్రిరావు అతన్ని చేతితో సైగచేసి పిలిచాడు. అతను దగ్గరకి వచ్చాడు.

"పంతులూ! ఇనస్పెక్టరు రేపు సాయంత్రం కదా ఇక్కడినుంచి మకాం ఎత్తివేస్తాడు?" అన్నాడు సింహాద్రిరావు.

"ఔనండిబాబూ!"

"అయితే. ఇవాళ మధ్యాహ్నం. అపరాహ్నం, సాయంత్రం, రాత్రి. రేపు తెల్లవారి జాము. పూర్వాహ్నం, మధ్యాహ్నం. అపరాహ్నం. చూశావా ఎన్నికాలాలో! ఇన్ని ఎలాగ అబ్బా! గడపడం!" అన్నాడు ఆశ్చర్యపోతూ.

"ఔను! నిజమేనండి బాబూ!" అన్నాడు పంతులు.

"అయితే కాలక్షేపంలేందే కాలం ఎలాగు గడుస్తుందయ్యా!" అని అడిగేడు సింహాద్రిరావు.

బాబూ! తమరు చెప్పేది అంతుపట్టడంలేదు."

"మరి కాస్తసంస్కృతంలో వేలు పెట్టినవాడికి, అడవులవెంట పొట్టపట్టుకొని తిరిగేవాడికి అమాత్రం తేడా ఉండదిటయ్యా! సరేగాని మొదటి సంగతి. నీకేం సంస్కృతం వచ్చా ఏమిటి పంతులూ?" అని ప్రశ్నించాడు సింహాద్రిరావు.

"బాబూ? మామొహాలకి తిన్నగా తెలుగక్షరాలే రావండి" అన్నాడు పంతులు.

"మరేం. రామశబ్దం గడగడ వర్ణించమన్నావేమిటి?" అన్నాడు సింహాద్రిరావు.

"అందులో ఏముందో మాకేం తెలుస్తుందండి. అది మంత్రమో. తంత్రమో!" అన్నాడు పంతులు.

'అంతా చెవిటివాడిముందు శంఖం ఊదినట్లే అంటావు?"

'అంతేనండి బాబూ!'

'నేను అడగడ మేమిటంటే. కాలక్షేపం లేనిదే కాలం ఎలాగు గడుస్తుంది అని' అన్నాడు సింహాద్రిరావు.

'ఔనండి! ముక్కు మూసుకు కూర్చుంటే గంటలు గడిచిపోతా యేమిటండి!' అన్నాడు పంతులు.

'అంచేత మనం ఏదో ఒక పన్నాగం పన్నాలి.'

"ఏమిటి సెలవు?" అని పంతులు ఆలోచన కోసం ఎదురు చూశాడు.

"టీ పార్టీ తగిలిద్దాం" అన్నాడు సింహాద్రిరావు.

"దానికేముందండి. అదో పెద్దభాగ్యమా! రేపు మధ్యాహ్నం పెట్టుకొందాంలెండి." అన్నాడు మేష్టరు.

"అబ్బే! అది వట్టి అజ్ఞానం! రేపా! బాగాచెప్పావు! ఈ కర్మభూమిలో ముందు క్షణం మనది కాదయ్యా? ఇంకాఎక్కడో రేపంటావు. ప్రతిక్షణం ఏదో ఒకపని చేస్తూనే ఉండాలి. అది గీతాసారమైన కర్మయోగభావం. పైగా. 'తలచినప్పుడే తాతకిపెళ్ళి' 'శుభస్యశీఘ్రం' అని కోరికలు. కాబట్టి ఇవాళ మధ్యాహ్నమో. తప్పితే అపరాహ్ణమో. తప్పితే సాయంత్రమో అయిపోయి తీరాలి. ఇది రామదండులో చేరిన సుగ్రీవుడి ఆజ్ఞాభావిలముకో" అన్నాడు సింహాద్రిరావు.

పెద్దమేష్టరు "టీపార్టీకి కావలసిన పదార్థాలు ఎక్కడ దొరుకుతాయో ఏమిటో! డబ్బుసారవేసిన వస్తువు పుట్టని అడివయిపోయింది. పోని అంటే రాయనది భల్లూకపు పట్టు" అని పైకే ఆలోచించాడు.

"ఏదో అంతరాయం రాబోతూందని సింహాద్రిరావు జడిసి అబ్బాయీ! అన్నిటికి నన్ను నమ్ముకో. ఆభారం నా నెత్తిమీద పడివెయ్యి నాకు వదిలివేసి నీ పనులు నువ్వు చూసుకో. అదే పరోపకారమంటే. ఒకడిపని మన బుజాలమీద మొయ్యడమేకాదుటయ్యా పరోపకారమంటే! ఇప్పుడు మీరు పూనుకొని మీ ఇనస్పెక్టరుకి చెయ్యవలసిన టీ పార్టీ నా బుజాలమీద వేసుకొని భరించడానికే పరోపకారమంటారు పెద్దలు కాబట్టి అంగటికి నేనేకబురు పంపిస్తాను. ఆ డబ్బులు మాత్రం నువ్వు చెల్లించుకొంటూగాని. నీ తీరుబాటు చూసుకొని!" అన్నాడు సింహాద్రిరావు వొప్పుకలిగించకుండా.

ఇది బాధలేని పనిగా తోచింది పెద్దపంతులుకి అందుచేత బుర్ర ఊపేడు.

"ఇనస్పెక్టరు మళ్ళీ కేకలు వేస్తాడు కాని నువ్వు ఆపని మొదట చూసుకో! లేలే! లేచివెళ్ళు!" అని పంతులు కనిలేదాకా కళ్ళలోనిప్పులు పోశాడు సింహాద్రిరావు.

బడికి వచ్చిన పిల్లలలో పెద్దవాళ్ళని ఆయిదారుగురిని ఏరేడు సింహాద్రిరావు. వాళ్ళతో "అబ్బాయిలారా? ఇవాళ పగటినిద్ర పనికిరాదు. పగటినిద్రవల్ల రెండు ప్రమాదాలున్నాయి. ఒకటి పనిపాట్లుండగా! రెండు ఆరోగ్యం చెడిపోతుంది! మూడోది కూడా ఉందన్న సంగతి పసివాళ్ళు మీరు తెలుసుకోండి. ముందు ముందు ముందుకి రావలసిన బేడిమూక కాబట్టి. రాత్రి కాలము దు తొందరగా నిద్రరాదు. అలాగు నిద్ర లేకపోగా కొన్నాళ్ళకి మతి చెడిపోతుంది. ఉండగా ఉండగా పిచ్చెక్కిపోతుంది! కాబట్టి ఇవాళ చెయ్యవలసిన ముఖ్యమైన పనులు బోలెడు ఉన్నాయి. ఒక స్వీట్. ఒకహాట్. ఒకకాఫీ. మొత్తం ఎన్ని? నువ్వు చెప్పరాగుండూ అంటూ ఒక విద్యార్థి వైపు చూశాడు.

వాడు జవాబు చెప్పడం ఆలస్యం చెయ్యగా.

"బోడికి బొట్టెట్టి
బొమ్మంచు చీరెగట్టి
బోడిముండ నెత్తిమీద
రాం రాం రాం"

అనివాడినెత్తి మీద మద్దిల దరువు తీశాడు. "ఏమిరా? అలాగు మిటకరిస్తూ నిల్చుంటా వేమిరా!" అని ఇంకొకరి వైపుచూసి "ఒరేయ్ కొండముచ్చా! నువ్వుచెప్పు?" అన్నాడు.

"వాడు ఒండుంది అయ్యాగారు!" అన్నాడు.

"అడివి వెధవల్లారా! ఇదా మీచదువు! ఎన్నిరాబొండూ! "అని అని ఇంకొకరి నడిగారు;

"చూడండి" అనివాడు జవాబు చెప్పాడు.

"వెర్రి గుడ్! వెరిగిడ్!" అన్నాడు సింహాద్రిరావు.

విద్యార్థులు కొందరి మొహాలమీద చిరునవ్వు మొలకెత్తింది. మరి కొందరి మొహాలమీద సందేహ జ్ఞానం తొణికిసలాడింది.

సింహాద్రిరావు "ఇరేయ్! సిద్దప్పా! నువ్వు అంగడికివెళ్ళి ఉప్మా కోసం రవ్వ తీసుకురారా!" అన్నాడు.

"పెద్దగొట్టమూ, సిన్నగొట్టమూ అండి?" అని అడిగాడు వాడు.

'వెదురు ముక్కల గొట్టాలేనా?" అని ప్రశ్నించాడుసింహాద్రిరావు.

'ఔనండి అయ్యగారూ!'

"అయితే పెద్దగొట్టమే తగలపెట్టు. నలుగురికీ సరిపోవద్దు. ఐదు ద్దాయి. సరే గాని. ఓర్రా! పెద్దవాళ్ళు ఏదేనా తినేటప్పుడు కనక మీరు దగ్గిర నిల్చుని వెధవకాకి చూపులు చూశారంటే తుపాకీ బారుచేసి 'ఢాం' అని పేల్చేస్తా!' అన్నాడు సింహాద్రిరావు.

'బాబోయ్!' అంటూ వెనక్కి పడ్డాడు ఒక కుర్రవాడు. తక్కిన వాళ్లు బిక్కమొహాలు వేసుకొని నిల్చున్నారు.

'చూశారానాతడాఖా' అందుకని మిమ్మల్ని ఎప్పుడు పిలిస్తేఅప్పుడు హాజరవాలి, తతిమావేళలలో వెళ్ళి చెట్టుకింద కోతులలాగు కూర్చోవాలి. తెలిసిందర్రా" అన్నాడు సింహాద్రిరావు,

'సిత్తంబాబుగారూ!' అన్నారు కొందరు పిల్లలు.

'సరే కాని! ఇరేశెంటాయి పీచూ! అని సింహాద్రిరావు మరొకడ్ని పిలిచి నువ్వు పాలసంగతి కనుక్కో!' అన్నాడు.

'ఎంతమంది?'

"ఎంతేమిట్రా పాలకి! ఎన్ని ఉంటే అన్నీను!"

"ఒక లోటాడు ఉంటేనండి."

"అందులో ఒక్కచుక్కైనా దారిలో పోశావంటే మీ మేష్టారుతో చెప్పి. వీపుచీరిపించేసి. పగలు ఎండ వేయించి. రాత్రి నక్కలుఎత్తుకు పోకుండా జాగ్రత్త పెట్టిస్తా!" అన్నాడు సింహాద్రిరావు.

"తమరు సెప్పినట్టే నడుచుకుంటానండి అయ్యగారూ!" అనివాడు భయభక్తులు వెల్లడించాడు.

"వెర్రి గుడ్!" అన్నాడు సింహాద్రిరావు.

పిల్లలంతా అయోమయంగా చూశారు.

అక్కడ ఉన్న ఒక కుర్రవాడు ముందుకొచ్చి "నేనేం చెయ్యనండి! నేనేం చెయ్యనండి!" అని ఉబలాటపడ్డాడు.

"ఒరేయ్! దొక్కల శాండో! నువ్వనాలో కుర్చీపట్టు!" అని సింహాద్రిరావు చేతికిదొరకని మీసం తిప్పి "షహబాష్!" అన్నాడు.

పిల్లలందరూ పకపక నవ్వేశారు.

"నాను పట్టలేనండి బాబు!" అన్నాడు ఆ బక్క కుర్రవాడు.

"అయితే చానకుండా ఒకమూల కూచో" అన్నాడు సింహాద్రి రావు.

వాడు బిక్కమొహంవేసుకొని ఒకమూల చతికిలపడ్డాడు.

సింహాద్రిరావు మరొకడ్నిచూసి "ఒరేయ్! ఎలుగుగొడ్డా! నువ్వు వెళ్ళి కాఫీ బిళ్ళలు తీసుకురా?" అన్నాడు.

"ఎన్నండి!"

ఎన్నండి అంటే నాకుమట్టుకు సరిగా తెలిసిచచ్చిందిట్రా: కాబట్టి పాలలోటావాడికి చూపించు. దాని ఉరుపుచూస్తాడు. ఒరేయ్! ఉట్టిలోటా చూపించుసుమా! లేక పోతే కోమటి మాయలో పడిపోతావు" అని హెచ్చరించాడు సింహాద్రిరావు.

"సరేనండి!"

"చూపించి, ఎన్ని బిళ్ళలు పడతాయని అడిగి తెలుసుకొని తీసుకురా!"

"సి తమండి!"

"వెరిగుడ్." అన్నాడు సింహాద్రిరావు.

పిల్లలందరి మొహాలమీద చిరునవ్వు కాసింది.

"ఒరేయ్! ముక్కాడా!" అని సింహాద్రిరావు పిలవగా ఆ విద్యార్థి అటు ఇటు దిక్కులు చూస్తున్నాడు.

"నిన్నేరా! నీ ముక్కుకి కాడలేదట్రా, 'ముక్కుకాడ' ఏమవుతుందిరా! నిన్నే! చెప్పు" చెప్పవేం? అని ప్రశ్నించాడు సింహాద్రిరావు.

వాడు "ముక్కాడ అవుతుందండి" అని సమాధానం ఇచ్చాడు.

"ఇకేం మరి! ఇటు ఆ బిత్తరపోయి చవట చూపులు చూస్తావు! వెధవ చూపులూ నువ్వూను! నువ్వు వెళ్ళికొట్టుమీంచి ఎలకాయలు పట్టుకురా" అన్నాడు సింహాద్రిరావు ఘరానాగా.

వాడు "కొట్టుమీంచి ఎందుకండి! సెట్టుమీంచే అట్టుకొత్తానండి!" అన్నాడు.

"అయితే ఇక్కడ ఏలకాయచెట్లు ఉన్నాయంటావుట్రా!" అని సింహాద్రిరావు ఆశ్చర్యపడ్డాడు.

"అవునండి!"

"వెరిగుడ్!" అని సింహాద్రిరావు తనలో "అయితే ఇక్కడ సుగంధద్రవ్యవర్తకం కూడా చెయ్యవచ్చునన్నమాట. అదా సంగతి. ఇది ఈ క్షణందాకా బైట పడలేదు. ఇది రహస్యంగా అట్టేపెట్టాలి. వర్తకుడికి తెలిసిందంటే గద్ద తన్నుకుపోయినట్టు తన్నుకు పోతాడు. ఈస్టుఇండియా వర్తక కంపెనీ ఏర్పాటుచేస్తాడు" అనుకొని సంతోషించి 'ఇంకేంకావాలి?" 'అని ఆలోచించి. పోపు.సామగ్రి అవసరం' అనుకొంటూ 'ఒరేయ్! జీడిగింజా!' అని మరొకడివైపు చూసి పిలిచేడు.

వాడు 'నాపేరు అదికాదండి బాబూ!' అంటూ తిరగబడ్డాడు,

ఇవన్నీ సహజమైన పేర్లురా వెధవా! సభ్యలోకంలో చాటుగా అంటారుకాని మనిషిమొహం ముందర అనడానికి ఒక్కడికీ దమ్ము చాలదు. దీనికి. దానికి అంతేభేదం. వీటిని పుట్టుపేర్లు అంటారు. ఇవి పెట్టుపేర్లు కావురా జీడిగింజా! మనిషిని ఫొటో తీసినట్టుగా పేరు సరిపోతుంది. కాబట్టి ఇటువంటి సహజమైన పేరుకి నువ్వుమరేమీ అభిమానపడిచావద్దు' అని వాడ్ని సమాధానపరిచి 'నువ్వు బాగా తెలివైనవాడిలాగున్నావు కాబట్టి వెళ్ళి పంచదార పొట్లం తీసుకురా! తినేశావంటే చంపేస్తా! అని తెలియజేశాడు సింహాద్రిరావు.

'సిత్తమండి అయ్యగారూ!' అన్నాడు ఆవిద్యార్థి.

'వెరీగుడ్!' అన్నాడు సింహాద్రిరావు.

పిల్లలమొహం పైన నవ్వువెలిసింది.

'ఓర్రోయ్! వెళ్ళి ఇక్కడున్నట్టెగా రావాలి మీరంతా. ఇదే సుగ్రీవుడి ఆజ్ఞ!' అన్నాడు సింహాద్రిరావు.

'చిత్తమండి!' అన్నారు పిల్లలంతా.

'నేను నా పనిమీద వెళుతున్నాను గానీ' అని అతను వెనక్కి తిరగగా, ఒక పిల్లవాడు 'వెరీగుడ్డు, బర్రెగొడ్డు!' అన్నాడు. సింహాద్రిరావు వెనక్కి తిరిగి 'ఎవడురా వాడు!' అనగా వాళ్ళు లేడిపిల్లలలాగు పరుగెత్తిపోయి, దొంకలచాటునుంచి 'వెరీగుడ్డు బర్రెగొడ్డు! వెరీగుడ్డు బర్రెగొడ్డు' అని పాట పాడేశాయి. సింహాద్రిరావుకి ఒళ్ళు మండిపోయి నాలుగడుగులు ముందుకు వెయ్యగా, వాళ్ళు పారిపోయేరు.

అతను అక్కడేఉన్న కొండ కరివేపాకు చెట్టునిచూసి ఆనందపడి 'బలే! బలే!' అంటూ ఇంత కొద్దవిరిచి. 'ఈ రెబ్బలు ఉప్మాలో వేస్తే గుమ్మగా ఉంటుంది.' అంటూ తీసుకువచ్చాడు. అతను సేమ్యా పాయసం గురించి ఆలోచించి 'మంచి ఒకటోరకం సేమ్యాపాయసానికి కల్తీలేనిపాలు చాలా అవసరం. ఇంత నెయ్యి మరీ అవసరం. దానిలో పడవలసిన పదార్థాలలోనే ఉందిమజా అంతా: ద్రాక్ష. కిస్మిస్‌పళ్లు. జీడిపప్పు. పిస్తా. ఏలకులు. పచ్చకర్పూరం. కుంకుమపువ్వు. జాపత్రి. జాజికాయ. ఇట్లాంటి నెంబరు వన్ సరుకు పడితే మళ్ళీ మనిషికిందికి చూస్తాడా! అట్లానోటిలో వేసుకోగానే. మనిషి మానవలోకం. దృష్టిఊర్ధ్వలోకం! కాని మనం చేసేవన్నీ కక్కుర్తిపనులే! మనం చేసేపనులకి. తినేసరుకుకీ సరిపోయింది! ఈ అడివిలో అమృతం రమ్మంటే ఎక్కడినుంచి వస్తుంది చెప్పండి! అనుకొంటుండగా ఏలక కాయలకోసం వెళ్లిన కుర్రవాడు బట్టలో మూటకట్టి తీసుకువచ్చి మూట అక్కడ పెట్టాడు.

"ఏమిట్రా అది మునక్కాడా?" అని ప్రశ్నించేడు సింహాద్రిరావు.

"ఎలక్కాయలండి!"

"అయ్యబాబోయ్! అయ్యబాబోయ్!" అని సింహాద్రిరావు గుండె బాదుకొని "అవన్నీ ఏలక్కాయలే! ఏలక్కాయలే! రూపాయలమూట!

రూపాయలమూట! ఒరేయ్! ఇది ఎవళ్ళకీ చెప్పకురాబాబూ! కోటీశ్వరులైపోతారు!" అని పొంగిపోయి పైకి గుండ్రంగా కనపడతాయేమిట్రా బంతులలాగు! ఏకంగా గుత్తులకి గుత్తులు కోసుకు వచ్చేశావేమిట్రా వెర్రి మొహమా. పింజెలు, పువ్వులు కూడా! వాసనలేదేమిరా? ఎండితే కాని వాసన రాదులే! నీకు తెలియదులే ఆ సంగతి:" అని "మూట విప్ప వేమిట్రా మొద్దా," అని తొందర పడిపోయేడు.

ఆ పిల్లవాడు మూటవిప్పగా అన్నీ వెలగకాయలు!

"ఓరి వెధవా!" అని ఎత్తిపోయేడు సింహాద్రిరావు.

"ఇవేనండి వెలక్కాయలంటారు మాయూళ్లో" అన్నాడు విద్యార్థి.

"నీకు చెప్పడం నా బుద్ధిపొరపాటురా! నువ్వో జడ్డిమృగానివి! ఓరి అవకతవక వెధవా! నువ్వు సరిగా అంగడికి వెళ్ళి అడిగిరా. ఏలక్కాయలు కావాలి మా దొరగారికి అని. పో! వెళ్లు!" అని చురచుర చూశాడు సింహాద్రిరావు.

వాడు ఆ కాయలు అక్కడ దిమ్మరించి గుడ్డపట్టుకు పోయేడు. కాయలు బంతులులాగా సావిడి అంతా చెదిరి. కిందకి కూడా దొర్లేయి.

తక్కిన పిల్లలు వచ్చి పదార్థాలు సావిట్లో పెట్టారు. వాటిలో ఒక చక్కటి పేకెట్ ఉంది. "అదేమిట్రా జీడిగింజా!" అని ప్రశ్నించాడు సింహాద్రిరావు.

"పంచదార పొట్లమండిబాబూ?" అన్నాడు కుర్రవాడు.

"భేష్, పనిఅంటే నీదిరా పని! అలాగు శుభ్రంగా దొరగారి టేబులీలాగు చెయ్యాలిరా. నువ్వు పైకి కాలిన జీడిగింజలాగున్నా. లోపల అంతా కమ్మని పప్పురా." అన్నాడు సింహాద్రిరావు వాడ్ని మెచ్చుకొంటూ.

"బాబూ! నేను నిజంగా సేవకు కాదంటండి అయ్యగారూ!" అన్నాడు వాడు సంతోషంతో.

"వెరిగుడ్, జీడిగింజా!"

కథా నిలయం
శ్రీకాకుళం



కుర్రవాడు మొహం ముడుచుకుపోయింది. "నన్ను అలా పిలవకండి దొరగారూ!" అనికోరేడు.

"ఏమిటి! 'జీడిగింజా' అనా! ఔనురా! పాపం! నువ్వే అందరిలోకి మంచివాడిలాగున్నావురా! అయితే నీ పెట్టు పేరేమిటి చెప్పు?"

"మల్లిదొరండి."

"అయితే బొండుమల్లె అని పిలవమన్నావా. లేక అడివిమల్లె అని పిలవమన్నావా?"

"ఏం వద్దండి నా పేరె పెట్టి పిలవండిసాలు."

"ఓహోహో! నీకు అదో తెగులుందిర్రా, అయితే సరే! మల్లెతెగులూ అని పిలుస్తాలే. పో" అన్నాడు సింహాద్రిరావు

ఆ పిల్లవాడికదేమి అర్థంకాలేదు. "సత్తమండి." అన్నాడు.

"అలాగు దోవలోకిరా! "వెర్రిగుడ్?" అన్నాడు సింహాద్రిరావు.

"నన్నోనండి బాబూ." అన్నాడు మరొక కుర్రవాడు సాహసించి.

"నువ్వుర్రా సిద్దప్పా! నీ వ్యవహార నామధేయమేమిర్రా?" అని ప్రశ్నించాడు సింహాద్రిరావు,

"సల్లదొరండి అయ్యగారూ!" అన్నాడు వాడు అడిగినమాటయినా తెలియకపోయినా.

"సరేపో! చల్లతెగులు అని పిలుస్తాను" అని సింహాద్రిరావు వాడి చెవిపట్టుకొని 'కీ' ఇచ్చేడు.

వాడు "ఒద్దండిబాబో! ఒద్దండిబాబో!" అని గోలపెట్టేడు "అలాగు దోవలోకిరా!" అన్నాడు సింహాద్రిరావు. దానితో అడగదలచుకొన్న మరికొందరి కుర్రవాళ్ళ నోళ్ళకి తాళాలు పడ్డాయి.

సింహాద్రిరావు టీ పార్టీ కోసం ఫలహారాలు తయారు చేస్తున్నాడని ఉపాధ్యాయులు చెప్పాగా విని డిప్టీఇనస్పెక్టరు నందకిశోరరావు సంతోషించాడు.

సింహాద్రిరావు పొయ్యిరాజేసి. గిన్నెపెట్టి 'స్థిరోభవ. వరదోభవ. సుప్రసన్నోభవ. విఘ్నేశ్వరుడా! వినయకుడా! గణాధిపతీ! తండ్రీ! నీదే భారం! మాదే అదృష్టం" అని కాస్త గోదుమరవ్వ. రెండు సీమ్యాతీగెలు మంటలో పడవేశాడు. అగ్నిహోత్రుడికి తృప్తిగా.

అతను అడివి కర్రల మోపులు ఎగా గా తగలపెట్టి పదార్థాలు తయారు చేశాడు.

చివరకు ఫలహారాలు చెయ్యడానికి అందరినీ రమ్మని విద్యార్థుల చేత కబురు పంపించాడు. పిల్లల చేత రెండు తాటాకు చాపలు పరిపించి, గళాసులతో నీళ్ళు పెట్టించి. విస్తరాకులు వేయించాడు.

నందకిశోరరావు. ఉపాధ్యాయులువచ్చి ఆసీనులయేరు.

పెద్దమేష్టరు చిన్నమేష్టరు చెవిలో ఏదో నెమ్మదిగా మాట్లాడుతున్నాడు. అదిచూసి సింహాద్రిరావు "నోరుమూసుకు తినండయ్యా పెద్ద మనుష్యులు!" అన్నాడు.

"నోరుమూసుకుంటే తినడమెలాగండి అయ్యగారూ?" అన్నాడు పెద్దమేష్టరు.

"మరొకడికి వినబడకుండా మాట్లాడమెలానో తినడమూ అలాగే" అన్నాడు సింహాద్రిరావు.

అది, తనమీద దెబ్బకాదా అని పెద్దమేష్టరు నోరుమూసు కొన్నాడు.

"ఏమిటయ్యా విశేషాలు?" అన్నాడు నందకిశోరరావు.

'సింహాద్రిరావు ఇది వరలో నల పాకం, భీమపాకం, నారసింహ పాకం అన్నమాటలె పలాయనిలో ఉన్నాయి. ఇప్పుడు వాటిని మించిన సింహాద్రిపాకమనేది రాత చేర్చవలసిన కాలం ఆసన్నమయింది" అన్నాడు.

'అంతా కొత్త కొత్త పదాలు ఫోం వెయ్యడమేనా. లేక విస్తళ్ళలో వి దవడ మేతేనా ఉందా?" అని అగేడు నందకిశోరరావు.

'తొందరపడితే అరిసెలపాకం నీరయిపోయిందన్న అత్తగారికథ జ్ఞాపకం తెచ్చుకో!" అన్నాడు సింహాద్రిరావు.

'ఇదీ ఆమోస్తరుగానే అవుతుంది కదా?' అంటూ ఇనస్పెక్టరు 'అయితే రుచి ఎలాగుండబోతుందంటావు!' అని అడిగేడు.

'సింహాద్రి పాకానికి వేరేచెప్పాలిటయ్యా! తినబోతూ రుచిఅడగడ మెందుకు? ముంజేతి కంకణంబున కద్దంబేల అని చిన్నయసూరి. మీరు చవిచూసి తర్వాతే ఇయ్యండి బిరుదు. మరేం తొందరలేదు. పెక్కు మాటలేల విప్రవర్య అన్నాడు భాగవతకారుడు' అంటూ సింహాద్రిరావు గ్లాసులతో పాయసం ముందుపెట్టాడు.

ఇనస్పెక్టరు, మేష్టర్లు పాడ పాయసాన్ని నాలుక కొనలకు తాకించి విస్తుపోతూ. ఒకరిమొహం ఒకరు చూసుకొన్నారు.

అందరిమొహాలు వికారంగా ఉండడం కనిపెట్టాడు. సింహాద్రిరావు. కాని ఏమీ బోధపడిలేదు. తెగించి "పంచదార తక్కువ అవలేదు కదా! అయితే మట్టుకు అదొక లోపమా? ఎక్కువయితే తీసివెయ్యలేంకాని తక్కువయితే ఏముంది? బ్రహ్మాండం! తలొక చెంచాడు కలుపు కుంటే అదే తీరిపోతుంది!" అన్నాడు నోరు చప్పరిస్తూ.

నందకిశోరరావు "అసలు దీంట్లో పంచదార ఏది?" అని ప్రశ్నించేడు.

"ఇంత పంచదారపోసేశానే. ఏటిలో ఉప్పు పోసినట్లు!" అన్నాడు! సింహాద్రిరావు.

"వేస్తే మరి ఇలాగుందేం ఉప్పగా" అన్నాడు నందకిశోరరావు.

సింహాద్రిరావు పరమాశ్చర్యపోయేడు.

"హెడ్ మాష్టరు" ఎలాగో ఉప్పు కలసి పోయిందండి సార్! అన్నాడు.

"రామ! రామ! ఉప్పెక్కడిది? పంచదార పొట్లంవిప్పి పోసేస్తేనే!" అన్నాడు సింహాద్రిరావు కంగారు పడుతు

"ఏది! కొంచెం తెచ్చిపెట్టు అని అడిగేడు ఇనస్పెక్టరు.

సింహాద్రిరావు గదిలోకి వెళ్ళి కాగితంలో కొంచెం పోసుకువచ్చి, చెంచాతో అందరిచేతులలో తలొక కాస్త వెయ్యగా, వాళ్ళు రుచి చూసి " ఛ! ఛ! ఛ! ఉప్పు! ఉప్పు! అన్నారు.

"ఉప్పేమిటయ్యా! బంగారులాంటి పొట్లం" అన్నాడు సింహాద్రిరావు ఆశ్చర్యంతో.

ఏదీ, పొట్లంతీసుకురా అన్నాడు ఇనస్పెక్టరు.

అతను తీసుకువచ్చి పొట్లం ఎదుటపెట్టగా దానిని పరిశీలి చేరు. దానిమీద టేబుల్ సాల్టు అని అచ్చుగుద్దఉంది. ఇది దొంగలఉప్పు అన్నాడు నందకిశోరరావు.

'అరే! తెల్లోడిమాయ! చివరకి ఇందులో కూడా కనబరిచేడుటయ్యా అరే! ఇంతవరకు ఏ రైళ్ళలోనో, ఏ స్టీమర్లలోనో, ఏ రేడియోలోనో అనుకొంటూంటే ఆఖరకి దీట్లో కూడా కనబరిచేడుటయ్యా! సరే! ఆ సంగతి అలాగుంచండి! పంచదారకోసమని కొట్టుమీదికి వెళ్ళిన గుంట వెధవ నేను తెమ్మన్నదేమిటి, వాడుతెచ్చిందేమిటి! అదీ అలాగుంచు, పంచదార ఇమ్మని పంపిస్తే కోమటి ఇదెందుకు ఇచ్చాడు? ఇందులో కూడా మాయే, మోసమే అంటూ లాపోయంటు ఎత్తేడు సింహాద్రిలావు.

చదువుకున్న వాళ్ళకి మీకేతెలియకపోతే నాకా తెలిసేడుస్తుంది అంటాడు కోమటి! అన్నాడు నందకిశోరరావు.

ప్రతీదీ పరీక్షచేస్తూ కూర్చుంటామటయ్యా, ఆఫీసర్లంకర్రిపెత్తనం చేస్తాముకాని? అన్నాడు సింహాద్రిరావు, ఉమ్మడిగా.

సేమ్యా పాయసం పాడైపోయినందుకు అందరూవిచారిస్తూండగా, సింహాద్రిరావు ఆకులలో ఉప్పొవడ్డించాడు. అంతారుచి చూసి మళ్ళీ ఒకరి మొహం ఒకరు చూసుకొన్నారు. మంచి అభిప్రాయం కోసం తన్నుకు లాడుతూన్న సింహాద్రిరావు, అందరిని ఆసుపత్రిలో మొహాలలా గుండగా ఏమీ తేల్చుకోలేక పోయాడు.

"దీంట్లో ఉప్పు వెయ్యలేదండి సార్!" పెద్దమాష్టరు.

"అన్న! మరిచిపోయాను!" అన్నాడు సింహాద్రిరావు.

'బాగానే ఉందయ్యోయి, నీ ఉప్మా" అన్నాడు నందకిశోరరావు.

"ఇవాళ లేచినవేళ బాగులేదు. ఎవరిమొహం చూశానో ఏమిటో! జ్ఞాపకంలేదు కాని జ్ఞాపకమే ఉంటేనా ఈ కొరకంచు తీసుకువెళ్ళి వాడి మొహాన పెట్టేవాడ్ని" అన్నాడు సింహాద్రిరావు, తనమీద నెపం పెట్టుకోకుండా.

"ఇవాళ లేవగానే నువ్వు అద్దంముందు పెట్టుకు కూర్చున్నావెందుకు?" అని ప్రశ్నించాడు నందకిశోరరావు.

"ఈ అడవి నివాసంవల్ల మనిషిలో మార్పేదైనా వచ్చిందేమో చూసుకోందామని" అన్నాడు సింహాద్రిరావు.

"అయితే లేవగానే నీ మొహం నువ్వే చూసుకొన్నావన్నమాట కాబట్టి కొరకంచు చికిత్స నీకే చేసుకోవచ్చు" అన్నాడు నందకిశోరరావు.

మేష్టర్లు నవ్వేరు.

"శకునం అనేది మన మొహానికి చెప్పలేదు శాస్త్రకారుడు. వితంతువు వీధిలోకి వెళ్ళేముందు శకునం చూసుకోడంలేదూ? అందుచేత శకునమంటే ఎదుటివాళ్ళ మొహం అనే వకీలుగారి అన్వయం" అని

"పైగా. ఉప్పు తెప్పించడం మాటే మరచిపోయాను. అయ్యయ్యో! ఎంత పని!" అంటూ వేలు కరుచుకొన్నాడు నింహాద్రిరావు.

అందరూ నవ్వేరు.

"ఇదిగో నీకు కావలసినంత ఉప్పు" అని నందకిశోరరావు టేబుల్ సాల్టు పేకెట్ ఎత్తి ముందు పెట్టేడు.

"ఇవాళ అంతా పొరపాట్లదినం! ఆప్ ఫూల్స్ డే లాగుంది రాజాగారికి" అన్నాడు.

అంతా తలొకకాస్త టేబుల్ సాల్టు ఉప్మాలో కలుపుకొన్నారు.

"సింహాద్రిపాకం ఎంత బాగుందో!" అన్నాడు ఇనస్పెక్టరు. మెచ్చుకొంటూన్నట్లు బుర్ర ఆడించి.

'ప్రమాదో ధీమతామపి' అన్నాడు కాళిదాసు. ఇహ నాబోటి నీబోటి వాళ్లో లెక్కా ఏమిటి! చంద్రునిలో మచ్చ అందాల తావు అంటే బ్యూటీ స్పాట్ అని తెలుసుకో!' అన్నాడు సింహాద్రిరావు.

'రాజాగారి లక్షణం మచ్చుకు పోనిచ్చుకొన్నావు కాములే. వెనకటికి ఒక రాజాగారు నాన్నా ఆచేత్తోటే కానియ్యి అన్నాడుట. ముష్టికివచ్చిబోర్ల పడ్డా మీసాలకి మన్ను అంటుకోలేదన్నాడుట ఒక మీసాలపోతు" అన్నాడు నందకిశోరరావు.

'పాకంలో ఉండే పాకం కనిపెట్టాలి నువ్వు!' అన్నాడు సింహాద్రిరావు.

'వెనకటికి, ఒక ఘనవ్యాస కర్త కవిత్వాన్ని వర్ణిస్తూ! ఉసుకుతారు పాకం, జనపనారపీచు పాకం అని వర్ణించారులే వాటిలో జమకట్టు నువ్వు దీనిని' అన్నాడు నందకిశోరరావు.

'అడవి జంతువులను ఊరజంతువులతోను, ఊర జంతువులను అడవి జంతువులతోను కలుపుతా వేమిటయ్యా పెద్దమనిషీ! బియ్యాన్ని వడ్లతో కలుపుతారా ఎక్కడైనా! పాలని పంచదారతో కలుపుతారుగాని' సింహాద్రిరావు అంటూండగా ఇనస్పెక్టరు అడ్డువచ్చి, 'సింహాద్రి పాకశాస్త్రం ప్రకారం సేమ్యా పాయసంలో ఉప్పుకలపవచ్చు' అన్నాడు.

మేష్టర్లు పకపక నవ్వేరు.

"సరేగాని, ఉప్మా చేదుగా ఉండడానికి కారణం ? అని అడిగేరు ఇనస్పెక్టరు.

"ఈ ఆకులేమిటి ?" అని ప్రశ్నించేరు పెద్దమేష్టరు.

"కరివేపాకని తెలియటం లేదటయ్యా పెద్దమనిషి !" అన్నారు సింహాద్రిరావు.

"కరివేపాకు ఈచుట్టు పట్లలేందే !" అన్నాడు చిన్నమేష్టరు.

అంతచెట్టుఎదుటపెట్టుకొనేఅన్నాడు సింహాద్రిరావు ఆశ్చర్యపోతూ.

"అదా సంగతి ! అది కొండ కరివేపాకుసార్ ! చేదు. చేదుసార్ !" అన్నాడు పెద్ద మేష్టరు.

"అరె ! చెట్టెంత మోసం చేసిందయ్యా ! ఇదంతా మోసపుట్టు రావణ రాజ్యంలాగుంది అన్నాడు సింహాద్రిరావు.

"ఇంకేం పాకం బాగానేవుంది!" అన్నాడు ఇనస్పెక్టరు.

సింహాద్రిరావు గళాసులలో కాఫి పోస్తూంటగా, ఇనస్పెక్టరు "అన్నట్టు మరిచిపోయేను ఆటం కాపి ఏది?" అని అడిగేడు.

"తొందర పడితే అరిసెలపాకం —" అన్నాడు సింహాద్రిరావు.

"కాఫిలో పంచదార వేశావా?" అని ప్రశ్నించేడు ఇనస్పెక్టరు.

"ఆ తెల్లటి పంచదారే!" అన్నాడు సింహాద్రిరావు.

"ఇంకేం ! అదీ తగలపడి పోయిందన్నమాటే !" అన్నాడు నందకిశోరరావు.

గళాసులలో కాఫీతలోకాస్త రుచిచూశారు. ఉప్పుగంధకషాయం, నీటితో పుక్కిలించి నోళ్ళు సుభ్రంచేసుకొన్నారు.

కాఫీ పాడయిపోయినందుకు సింహాద్రిరావు కాస్త విచారించాడు.

"టీ పార్టీబాగానే ఉంది. అజ్ఞానులవిందు (ఫీస్టు ఆవ్ ఫూల్స్) లాగు" అన్నాడు నందకిశోరరావు.

ఇంతలో పెద్దపంతులు ఇంటినుంచి మామ్మోలుగా వచ్చే కాఫి వచ్చింది. ఆ ఉడుకు ఉడుకు నీళ్ళని "కాలేకడుపుకి మండేబూడిద" అంటూ ఇనస్పెక్టరు పుచ్చుకొని ఆకలి చల్లార్చుకొన్నాడు.

ఇనస్పెక్టరు బడిపని చూసుకొందామని హడావిడిగా లేచిపోయేడు. అతని వెంట పెద్దమేష్టరుకూడ వెళ్లాడు. సింహాద్రిరావు చిన్నమేష్టరు అక్కడే కూర్చున్నారు.

సింహాద్రిరావు "కొట్టువాడు ఎంత మోసంచేశాడో చూడు! వాడు వట్టి దగాకోరు ముండా వాడు అని" అన్నాడు.

"నాకుమట్టుకు ఏమితెలుసండీ!"

"అయినా పెద్దమనుష్యులతో వ్యవహారమని తెలుసుకొని వాడు సరిగా నడుచుకోవద్దూ! పంచదార కోసం పంపిస్తే, ఉప్పుయిస్తాడా! ఎంతసాహసం! ఎంతసాహసం! నాకాసంగతి మొట్టమొదటే తెలిస్తే ఉడుకుడుకు సేమ్యాపాయసం తీసుకువెళ్ళి వాడిమొహాన్ని పారపోసేవాడ్ని" పోయినసెల్లాగా పోయింది! అన్నాడు సింహాద్రిరావు.

"నా మొతె ఉందికదండీ సెట్టిఅల్లముందా' అంటేబాబూ! బెల్లముందండి' అని" అన్నాడు పంతులు.

"అసలు సంగతి చెప్పలేయ్యావాళ్ళు. వాళ్ళని తమాము నమ్మిన వాళ్ళు గోతిలో దిగినట్టే! లాభాలెలాగున్నాయి సెట్టి' అంటే తెలిసిన పెదమనిషి ఒక్కడూ రాలేదండిబాబూ అన్నాడుట! అది అలాగుంచు. పోనీ వెళ్ళిన కుర్రకుంకకేనా. తాము తెచ్చేది మనం తెమ్మన్నసరుకా. మరొకటా అనికాస్త ఆలోచించవమూ! నీకేదేనా పనిచెప్తే నువ్వు ఇలాగే చేస్తావేమిటి!" అన్నాడు సింహాద్రిరావు.

"అబ్బే! ఎంతమాటండి! పెద్దమనుష్యులముందు ఎంత జాగ్రత్తగా మసులుకోవాలి. ఏమికథ?

నేను అన్నప్రకారం దోమతెర - మంచిదో. చెడ్డదో - అంద చేనానా లేదా అండి" అన్నాడు పంతులు.

"నీమాట కాదోయ్ నేను చెప్పడం." అన్నాడు సింహాద్రిరావు.

ఇంతటిలో పెద్దమేష్టరు కేకవెయ్యగా చిన్నమేష్టరు. వెళ్ళేడు.

సింహాద్రిరావుకి ఏమీ తోచకపోగా రెండడుగులు అవతలకి వేశాడు.

ఒక మూలనుంచి
వెర్రిగుడ్డు
బర్రెగొడ్డు
అనే శబ్దం వినవచ్చింది,

సింహాద్రిరావు చెలరేగిపోయేడు. "ఎవడురా ఆ తుంటరి! ఎవ

డురా ఆ ఆకతాయి! ఎవడురా ఆ రాలుగాయి! ఎవడా నెలతక్కువ వెధవ" అంటూ లేచేడు.

"పాయసం వెర్రిగుద్దు
ఉప్పమా వెర్రిగుద్దు
కాఫి వెర్రిగుద్దు
వెర్రిగుద్దు బర్రెగొడ్డు

అని పాటవరస రాగా, సింహాద్రిరావు ఉగ్రుడై పోయి "ఏనకురా-ఆలుచ్చా, తుచ్చా, ముచ్చు, చచ్చు, కొచ్చు, లొచ్చు" అంటూ ముందుకి ఉరికేడు.

'అచ్ఛా' అన్నాడు ఒక కుర్రవాడు.

"ఓరి మీ చదువుకాలిపోను! ఓరి మీ పుస్తకాలు, పలకలు బుగ్గి అవా!" ఓరి నీ బచ్చిసాక మండిపోను! అంటూ సింహాద్రిరావు. ఆ కొమ్మలు, ఈ కొమ్మలు ఒత్తిగిలించి పిల్లలకోసం వెతికేడు. కాని ఒక్కడూ కనపడడు. శబ్దం ఎప్పటిలాగే వినవస్తూండగా అడివిచెట్లు వెయ్యినోళ్ళతో సింహాద్రిపాకాన్ని గురించి హేళనచేస్తున్నాయా అనిపించింది. అతను తిరిగి సావిటిలోకివచ్చి "పట్టిఆలోచనలకి పోయి ఏమి ప్రయోజనం! కుర్రవెధవలతో వేళాకోళాలాడడమే వచ్చిన ముప్పేలా. వాళ్ళతో సరిసమానంగా మాట్లాడితే, ఆటలాడితే వాళ్ళు మననిలోకువ కట్టేస్తారు. అతి పరిచయాన వజ్ఞత అని సంస్కృత లోకోక్తి. పిల్లలను ఎప్పుడూ కొంచెం దూరంలోఉంచాలి. ముసుపెట్టుకొంటే ముక్కుపట్టు కొన్నాడన్న సామెతే ఉంది. అంచేత వాళ్ళని ఎడంగా ఉంచడమే మనకు శ్రేయస్సు. 'బాలురతో చెలిమి ఇచ్చి భాషింపకుమీ' అని సుమతీ శతక కారుడు ఏనాడో కనిపెట్టేశాడు" అని తనకి బుద్ధిచెప్పుకొన్నాడు.

సింహాద్రిరావు సావిటిలోకూర్చుని టీ పార్టీ పాడై పోయిన సంగతి జ్ఞాపకంరాగా ఏక ఇదవుతున్నాడు.

మునిమాపు అయింది. పని చాలించి వంట ప్రారంభిద్దామని ఇన

ఇన్స్పెక్టరు కాగితాలన్నీ ఎత్తిపెట్టి ఇవతలకి వచ్చాడు. అతనితోపాటు పెద్ద మేష్టర్లు ఇద్దరూ వచ్చారు.

సింహాద్రిరావు "బావగారండీ!" అన్నాడు.

ఇనస్పెక్టరు ఇచ్చేనవ్వు ఆపుకొని "ఎందుకండి, సింహాద్రిపాక యాజిగారూ!" అన్నాడు.

దానిలో ఉండే హేళన కనిపెట్టి సింహాద్రిరావు. జంకిపోకుండా "ఉహ్! ఇంతేనామీరు కనిపెట్టేరు బావగారూ!" అన్నాడు.

"ఏమిటి?" అని ప్రశ్న వేశాడు ఇనస్పెక్టరు.

"పరిహాసాలనీ. సరసాలనీ వున్నదున్నట్టుగా తీసుకొంటారుటండి ఎవరేనా! అది సహృదయ లక్షణమా" వారలు రసజ్ఞులగుదురొక్కో?" అన్నాడు సింహాద్రిరావు.

"ఏమిటి నువ్వు చెప్పేది?' అని తెలియగోరేడు ఇనస్పెక్టరు.

ఎవరేనా 'బావగారు చాలా బుదిమంతులు' అని అంటే బావగారు నిజంగా బుదిమంతులనా అర్థం!" అన్నాడు సింహాద్రిరావు.

"ఔను నేనెలాగూ కాదులే!" అన్నాడు ఇనస్పెక్టరు.

"అబ్బె బ్బే! మీ సంగతి కాదు నేనుచెప్పడం! ఉదాహరణకి చెప్పాను. అంతే! ఇప్పుడు చూడండి. పెళ్ళిళ్ళలో సున్నపు ఉండలపేరు! కుంకుడుగింజల మాల! కొబ్బరి ముక్కల దండ. వియ్యపురాలి రవిక. పెళ్ళికొడుక్కి వెండిచేపలు. బజ్జీలు! తాంబూలాల్లో చింతగింజలు కొన్ని కొన్ని మోటసరసాలు విడిచిపెట్టి - విస్తళ్ళలో తెల్లటి ఉప్పుపొడివేసి "అయ్యా! పంచదార! బాబూ! పంచదార అని బతిమాలుకోవడం, ఇవన్నీ ఉన్నదున్నట్టుగా తీసుకోమనా భావం! ఇంకేం చాలాబాగుంది. చాలాసర సంగా ఉందండి బావగారూ!" అన్నాడు సింహాద్రిరావు.

"సరే! నువ్వు మాట్లాడేది ఎలాగ ప్రస్తుతం!" అన్నాడు ఇనస్పెక్టరు.

సేమ్యాపాయసంలో వుప్పువెయ్యడం, ఉప్మాలో మానిపెయ్యడం, కాఫీ వుప్పగా తయారు చెయ్యడం అవన్నీ సరసాలండీ! అయ్యో! ఖర్మమా